సాక్షి రంగారెడ్డి

శనివారం ı 21 ı డిసెంబర్ ı 2024



'లగచర్ల'కు పండుగొచ్చింది

లగచర్ల కేసులో జైలుకు వెళ్లిన గిరిజన రైతులు 37 రోజుల తర్వాత స్వగ్రామాలకు చేరుకున్నారు. 8లో►



కూతురి పెళ్లికి దాచిన..

ప్రమాదవశాత్తు ఇంట్లో మంటలు చెలరేగి రూ.లక్ష దగ్ధమైన సంఘటన శంకర్‌పల్లి మండలంలో చోటుచేసుకుంది. 8లో►



అందని విద్య, వైద్యం

ప్రభుత్వ విద్య, వైద్యం పేదలకు అందనంత దూరంలో ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్‌వెస్లీ ఆరోపించారు. 8లో►

న్యూస్‌రీల్

నిరుద్యోగ మైనార్టీ యువతకు నైపుణ్య శిక్షణ

ఇబ్రహీంపట్నం రూరల్: తెలంగాణ రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ మైనార్టీ యువతకు ఉపాధి కోసం నైపుణ్య శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మైనార్టీ సంక్షేమాధికారి నవీన్‌కుమార్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డాటా సైన్స్, డిజిటల్ మార్కెటింగ్ మేనేజర్ కోర్సులు నేర్పిస్తామన్నారు. ఇంటర్ ఆపై చదువుకున్న ఆసక్తి గల మైనార్టీ యువత తమ ఆధార్, ఎడ్యుకేషన్ డాక్యుమెంట్స్, ఆదాయం సర్టిఫికెట్లతో పాటు ఫొటోలు హార్డ్ కాపీలతో ఈ నెల 31వ తేదీ లోపు కలెక్టరేట్‌లోని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం

కేశంపేట: గడపగడపకూ సీపీఐ సిద్ధాంతాలను తీసుకెళ్లాలని పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరి నర్సింహారెడ్డి అన్నారు. పార్టీ ఆవిర్భవించి వందేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో మండల కేంద్రంలో శుక్రవారం ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. వంద సంవత్సరాల కాలంలో పార్టీ అనేక ఒడిదుడుకులను ఎదుర్కొందని తెలిపారు. ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటాలను కొనసాగించిందని గుర్తు చేశారు. అధికారం కోసం కాకుండా ప్రజ సమస్యల పరిష్కారం కోసం కృషి చేసిందన్నారు. అనంతరం పలువురికి పార్టీ సభ్యత్వాలను అందించారు. కార్యక్రమంలో కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగయ్య, నాయకులు రాంచంద్రయ్య, పారేష, కమలమ్మ, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

కన్హాలో ముగిసిన జాతీయ సమైక్యతా సమ్మేళనం



నవోదయ విద్యార్థుల నృత్య ప్రదర్శన

నందిగామ: మండల పరిధిలోని కన్హా శాంతివనంలో నవోదయ విద్యాలయ సమితి హైదరాబాద్ రీజియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ సమైక్యతా సమ్మేళనం 2024–25 కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా వికసిత్ భారత్, మహిళా సాధికారత, భారతదేశ సాంస్కృతిక వారసత్వం అనే అంశాలపై విద్యార్థులు ప్రదర్శనలు ఇచ్చారు. శాస్త్రీయ, జానపద సంగీతంతో పాటు ఆయా రాష్ట్రాల్లో ప్రాచుర్యం పొందిన కళలు, నృత్యాలు ప్రదర్శించారు. ఈ సమ్మేళనంలో ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు నవోదయ విద్యాలయ సమితి జాయింట్ సెక్రటరీ జ్ఞానేంద్ర కుమార్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నవోదయ విద్యాలయ సమితి ఉప సంచాలకుడు గోపాలకృష్ణ, వివిధ రాష్ట్రాలకు చెందిన అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదిబట్ల మున్సిపాలిటీకి చేంజ్‌మేకర్ అవార్డు



అవార్డు స్వీకరిస్తున్న మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ, పర్యావరణ ఇంజనీర్ సురేష్

ఇబ్రహీంపట్నం రూరల్: స్వచ్ఛభారత్ మిషన్‌లో మెరుగైన ప్రదర్శనకుగాను ఆదిబట్ల మున్సిపాలిటీని చేంజ్ మేకర్స్ అవార్డు వరించింది. ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ పర్యావరణ ఇంజనీర్ సురేష్‌తో కలిసి సీఎస్‌ఈ డైరెక్టర్ డాక్టర్ సునీత నరైన్ చేతుల మీదుగా స్వీకరించారు. 2022–24 వరకు చేపట్టిన స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా స్వచ్ఛత కార్యక్రమాలు, స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మెరుగైన ప్రదర్శన, కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా స్వచ్ఛ కార్యక్రమాలు, సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో ప్రతిభ కనబర్చిన మున్సిపాలిటీలకు ఈ అవార్డు అందజేస్తారు. అవార్డు రావడంతో తన బాధ్యత మరింత పెరిగిందని కమిషనర్ బాలకృష్ణ తెలిపారు.

కొత్తగా 2 మున్సిపాలిటీలు

చేవెళ్ల, మొయినాబాద్‌లో ఏర్పాటయ్యే అవకాశం



- అసెంబ్లీ సమావేశాల్లో ప్రకటించిన మంత్రి శ్రీధర్‌బాబు
- జిల్లాలో 15కు చేరనున్న పురపాలికల సంఖ్య
- మారనున్న రూపురేఖలు

చేవెళ్ల: జిల్లాలో మరో రెండు కొత్త మున్సిపాలిటీలు ఏర్పాటు కానున్నాయి. ఈ మేరకు మంత్రి శ్రీధర్ బాబు అసెంబ్లీలో ప్రకటించారు. కొత్త మున్సిపాలిటీల లిస్ట్‌లో చేవెళ్ల, మొయినాబాద్ ఉన్నాయి. ఈ రెండు మున్సిపాలిటీలు కూడా చేవెళ్ల నియోజకవర్గంలోనే ఉండటం విశేషం. జిల్లాలోని మేజర్ పంచాయతీలను మున్సిపాలిటీలుగా మార్చాలనే ప్రతిపాదనలు గత ప్రభుత్వం నుంచి ఉన్నాయి. గతంలో కందుకూరు, మహేశ్వరం చేవెళ్ల పేర్లు మాత్రమే వినిపించాయి. ప్రస్తుతం ప్రకటించిన జాబితాలో కందుకూరు, మహేశ్వరం పేరు లేకపోగా కొత్తగా మొయినాబాద్ పేరు చేర్చి ప్రకటించారు. జిల్లాలో ప్రస్తుతం 13 మున్సిపాలిటీలు కొనసాగుతుండగా కొత్తగా ఏర్పడే వాటితో కలిపి ఆ సంఖ్య 15కు చేరుకోనుంది. హైదరాబాద్‌కు అతి సమీపంలో ఉన్న మొయినాబాద్, చేవెళ్ల రూపురేఖలు పూర్తిగా మారిపోనున్నాయి.

చేవెళ్ల మున్సిపాలిటీలోకి వచ్చే గ్రామాలు

ఆరేళ్ల కల నెరవేరబోతోంది. ఎట్టకేలకు అసెంబ్లీలో పేరు ప్రస్తావించటంతో చేవెళ్ల మున్సిపాలిటీ ఏర్పాటు ఖాయమైంది. చేవెళ్ల, దామరగిద్ద, ఇబ్రహీంపల్లి, దేవుని ఎర్రవల్లి, కేసారం, మల్లారెడ్డిగూడ, మల్కాపూర్, ఊరేళ్ల, పామెన, కందవాడ, పలుగుట్ట, రామన్నగూడ గ్రామాలను కలిపి మున్సిపాలిటీగా ఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రతిపాదనలు పంపించారు. మొత్తం 12 గ్రామాల్లో 24 వేలకుపైగా జనాభా ఉన్నట్టు ప్రతిపాదనల్లో తెలిపారు. అటు ఇటుగా ఏవైనా గ్రామాలు మారే అవకాశం ఉండనుంది.. లేదంటే ఈ 12 గ్రామాలతో చేవెళ్ల మున్సిపాలిటీ కానుంది.

మొయినాబాద్ మున్సిపాలిటీలో చేరే గ్రామాలు

మొయినాబాద్ మండలంలోని ఏడు గ్రామాలను కలిపి మున్సిపాలిటీగా మర్చేందుకు ప్రతిపాదనలు పంపించారు. మొయినాబాద్, అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్, ఎనికేపల్లి, చిలుకూరు, పెద్ద మంగళారం, సురంగల్ గ్రామాల్లోని 26వేల జనాభాతో కలిపి మొయినాబాద్ మున్సిపాలిటీగా ఏర్పాటు కానుంది. మొయినాబాద్ మున్సిపాలిటీ ప్రతిపాదనను స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య ముఖ్యమంత్రికి పంపించడంతో ఈ పేరు తెరపైకి వచ్చింది. ఇటీవలే అధికారులు సైతం దీనికి సంబంధించిన వివరాలతో కూడిన ప్రతిపాదనలు పంపించారు.

చేవెళ్ల నియోజకవర్గంలో మూడు

చేవెళ్ల నియోజకవర్గంలో ఇప్పటికే శంకర్‌పల్లి మున్సిపాలిటీ ఉండగా కొత్త వాటితో కలిపి మూడు కానున్నాయి. చేవెళ్ల అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గ కేంద్రంగా ఉన్నప్పటికీ మున్సిపాలిటీ కాలేకపోయింది. ఐదేళ్ల క్రితం వరకు మున్సిపాలిటీలు లేని నియోజకవర్గంగా ఉండగా శంకర్‌పల్లితో మొదలై ఇప్పుడు మూడు మున్సిపాలిటీలు ఉన్న నియోజకవర్గంగా మారుతోంది.

రెండు పేర్లే ప్రస్తావన

కొత్త మున్సిపాలిటీలపై అధికారికంగా ప్రకటన రావాల్సి ఉంది. అసెంబ్లీలో మంత్రి శ్రీధర్‌బాబు జిల్లాల వారీగా చేయబోతున్న మున్సిపాలిటీల జాబితాలో మన జిల్లా నుంచి చేవెళ్ల, మొయినాబాద్ రెండు పేర్లు మాత్రమే ప్రస్తవించారు. వేరే మున్సిపాలిటీలు ఉన్నాయా లేక ఈరెండు మాత్రమేనా అనేది తెలియాల్సి ఉంది.

మరింతగా అభివృద్ధి



చేవెళ్ల మున్సిపాలిటీ గతంలోనే కావాల్సి ఉన్నప్పటికీ ఆలస్యమైంది. చేవెళ్లతోపాటు మొయినాబాద్‌ను కూడా మున్సిపాలిటీగా మార్చాలని ముఖ్యమంత్రిని కోరడంతో అందుకు ఆయన అంగీకరించారు. హైదరాబాద్‌కు అతి చేరువలో ఉన్న చేవెళ్ల, మొయినాబాద్ మున్సిపాలిటీలుగా మారితే మరింత అభివృద్ధి చెందుతాయి.

– కాలె యాదయ్య, ఎమ్మెల్యే చేవెళ్ల

'మహా' ధ్యానం.. అంతా సిద్ధం



ఇప్పటికే చేరుకున్న ధ్యానులు



మహేశ్వర మహా పిరమిడ్ వ్యూ

- నేటి నుంచి పత్రీజీ ధ్యాన మహాయాగం
- 11 రోజుల పాటు కొనసాగనున్న వేడుకలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు
- వివిధ ప్రాంతాల నుంచి తరలివస్తున్న ధ్యానులు

కడ్తాల్: మహేశ్వర మహాపిరమిడ్ (పత్రీజీ శక్తి స్థల్)లో శనివారం నుంచి నిర్వహించే ధ్యాన మహాయాగ వేడుకలకు పిరమిడ్ ప్రాంగణం ముస్తాబైంది. ఈనెల 31 వరకు 11 రోజుల పాటు కొనసాగే కార్యక్రమాలకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. శుక్రవారం నుంచే వేలాదిగా ధ్యానులు తరలిరావడం కనిపించింది. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఉత్సవాలకు ప్రముఖ ఆధ్యాత్మిక, ధ్యాన గురువులు, కళాకారులు హాజరుకానున్నట్టు ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ధ్యానులకు ఇబ్బంది కలుగకుండా సౌకర్యాలు కల్పించినట్టు చెప్పారు.

ఏర్పాట్లను పరిశీలించిన డీసీపీ

ధ్యాన వేడుకల సందర్భంగా మహేశ్వర మహా పిరమిడ్‌ను శుక్రవారం సాయంత్రం శంషాబాద్ జోన్ డీసీపీ రాజేశ్, సీఐ శివప్రసాద్, ఎస్‌ఐ వరప్రసాద్ పోలీస్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఏర్పాట్ల గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. వారికి పలు సూచనలు చేశారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీసీపీ రాజేశ్



కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

కళ్లకు గంతలు కట్టుకొని నిరసన

14వ రోజుకు చేరిన సమగ్ర శిక్షా ఉద్యోగుల దీక్షలు

ఇబ్రహీంపట్నం రూరల్: సమగ్ర శిక్షా ఉద్యోగులను వెంటనే పర్మినెంట్ చేయాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద చేపట్టిన రిలే దీక్షలు శుక్రవారం 14వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వారు కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమానికి ఏఐటీయూసీ స్టేట్ జనరల్ సెక్రెటరీ ఓరుగంటి యాదయ్య, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పద్మ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సమగ్ర ఉద్యోగుల జేఏసీ అధ్యక్షుడు అజీజ్, కార్యదర్శి సంపత్, కోశాధికారి సాయికుమార్, మహిళా అధ్యక్షురాలు శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికల్లో సత్తా చాటాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి

మహేశ్వరం: త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ మెజార్టీ స్థానాలను కైవసం చేసుకుంటుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లిలో శుక్రవారం కార్యకర్తల సమావేశం నిర్వహించి గ్రామ, బూత్ కమిటీలను నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని గ్రామ పంచాయతీల్లో గెలుపొందేలా ప్రతి నాయకుడు, కార్యకర్త పని చేయాలని అన్నారు. కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజలను చైతన్యపర్చి పార్టీ పట్ల ఆకర్షితులను చేయాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కిసాన్‌మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు బస్వ పాపయ్య గౌడ్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మిద్దె సుదర్శన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మాధవాచారి, మాజీ సర్పంచ్ మనోహర్ పాల్గొన్నారు.



కొత్త కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందిస్తున్న బొక్క నర్సింహారెడ్డి

టిమ్స్‌లోనే మెడికల్ కాలేజీ?

- కొత్త వాటి ఎంపికపై పునరాలోచన
- మీర్‌ఖాన్‌పేట నుంచి కొత్తపేటకు..
- ఈసీఐఎల్ నుంచి అల్వాల్‌కు..
- మార్చే యోచనలో ప్రభుత్వం
- అన్నింటికీ ఇదే పరిష్కారమని భావన



సాక్షి, రంగారెడ్డిజిల్లా: మహేశ్వరం, కుత్బుల్లాపూర్‌లో కొత్త మెడికల్ కాలేజీలపై ప్రభుత్వం పునరాలోచనలో పడిందా? ప్రతిపాదిత స్థలంలో కాకుండా ఇప్పటికే ఇటు అల్వాల్, అటు కొత్తపేటలో చేపట్టిన తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్(టిమ్స్)లోనే వీటిని ఏర్పాటు చేయాలని భావిస్తోందా.. అంటే అవుననే అంటున్నాయి అధికారిక వర్గాలు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సహా ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి మదిలోనూ ఇదే ఆలోచన ఉన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. పరిపాలన భవనం, తరగతి గదులు, శిక్షణ కేంద్రాలు, లైబ్రరీ, క్యాంటిన్, వసతి గృహాల నిర్మాణానికి భారీగా ఖర్చవుతోంది. అంతేకాదు ఎంపిక చేసిన ఆయా మెడికల్ కాలేజీలు సిటీకి సుదూరంగా ఉండడం.. అంత దూరం వెళ్లేందుకు వైద్య సిబ్బంది సుముఖంగా లేకపోవడం.. వైద్య విద్యార్థుల ప్రాక్టీసుకు అవసరమైన టీచింగ్ ఆస్పత్రి అందుబాటులో లేకపోవడం.. ఒక వేళ ఉన్నా రోగుల నిష్పత్తి ఆశించిన స్థాయిలో లేకపోవడం ఈ పునరాలోచనకు కారణమని సమాచారం. అదే ఇప్పటికే నిర్మాణ దశలో ఉన్న టిమ్స్‌లో వీటిని ఏర్పాటు చేయడం ద్వారా రోగుల అవసరాలు తీర్చడమే కాకుండా వైద్య విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చూడొచ్చని భావిస్తోంది. సీనియర్ ఫ్యాకల్టీ సహా పారామెడికల్, నర్సింగ్ స్టాఫ్ సహా ఎలాంటి ఇబ్బందులు ఉండబోవని యోచిస్తోంది.

వడివడిగా టిమ్స్ పనులు

నగరంలోని ఉస్మానియా, గాంధీ సహా నిజామ్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్స్ సైన్స్(నిమ్స్) ఆస్పత్రులపై రోగుల భారాన్ని తగ్గించడంతో పాటు శివారు ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలనే ఉద్దేశంతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నగరానికి నాలుగు వైపులా నాలుగు స్పెషాలిటీ ఆస్పత్రులు ఏర్పాటు చేయాలని భావించింది. రూ.2,679 కోట్ల అంచనా వ్యయంతో ఎర్రగడ్డ ఛాతి ఆస్పత్రి, అల్వాల్, కొత్తపేట పండ్ల మార్కెట్ ఆవరణలో వీటిని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఒక్కో భవనం 11.5 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో 27 అంతస్తుల్లో ఈ భవనాన్ని నిర్మించనున్నట్లు (ప్రస్తుతం 12 అంతస్తులకు కుదించినట్లు సమాచారం) ప్రకటించింది. ఈ మేరకు శంకుస్థాపన కూడా చేసింది. ప్రస్తుతం ఆయా భవనాల నిర్మాణ పనులు వివిధ దశల్లోకొనసాగుతున్నాయి. ఇదే సమయంలో జిల్లాకు ఒక మెడికల్ కాలేజీని కూడా మంజూరు చేసింది. మేడ్చల్ జిల్లాకు కుత్బుల్లాపూర్‌లో, రంగారెడ్డి జిల్లాకు మహేశ్వరంలో మెడికల్ కాలేజీని ఏర్పాటు చేయాలని భావించింది. ఈ మేరకు మీర్‌ఖాన్‌పేటలో వంద ఎకరాల్లో భవన నిర్మాణానికి శంకుస్థాపన కూడా చేసింది. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓటమి పాలవడం, కాంగ్రెస్ అధికారంలోకి రావడం, ప్రభుత్వ ఖజనాలో ఆశించిన స్థాయిలో నిధులు లేకపోవడంతో ఇప్పటి వరకు నిర్మాణ పనులు మొదలు పెట్టలేదు.

పునరాలోచనలో ప్రభుత్వం

ఈ రెండు మెడికల్ కాలేజీలకు జాతీయ మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అనుమతులు జారీ చేయడంతో 2024–25 విద్యా సంవత్సరానికి ఎంబీబీఎస్ కౌన్సెలింగ్‌లో అడ్మిషన్లు కూడా పూర్తి చేసింది. ఒక్కో కాలేజీలో 50 మంది విద్యార్థులు అడ్మిషన్ పొందారు. అంతేకాదు పారామెడికల్, నర్సింగ్ కాలేజీలను కూడా వీటిలోనే ఏర్పాటు చేసి అడ్మిషన్లు చేపట్టారు. ఇప్పటి వరకు రెండు కాలేజీలకు శాశ్వత భవనాలు లేకపోవడంతో తాత్కాలిక భవనాల్లో పాఠాలు బోధిస్తున్నారు. కుత్బుల్లాపూర్ మెడికల్ కాలేజీ విద్యార్థులకు ఈసీఐఎల్‌లో ఓ ప్రైవేటు భవనంలో తరగతులు నిర్వహిస్తుండగా, మహేశ్వరం మెడికల్ కాలేజీ విద్యార్థులకు బొంగుళూరు సమీపంలోని ఓ అద్దె భవనంలో నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ప్రతిపాదిత ప్రదేశంలో అనుబంధ ఆస్పత్రులు లేకపోవడంతో మహేశ్వరం మెడికల్ కాలేజీకి వనస్థలిపురం ఏరియా ఆస్పత్రిని, కుత్బుల్లాపూర్ మెడికల్ కాలేజీకి మల్కాజిగిరి ఆస్పత్రిని ఎంపిక చేశారు. తాత్కాలిక భవనాలు, అనుబంధ ఆస్పత్రులకు 10 నుంచి 15 కిలోమీటర్ల దూరం ఉండటం, అనుబంధ ఆస్పత్రుల్లో రోగుల నిష్పత్తి ఆశించిన స్థాయిలో లేకపోవడం విద్యార్థుల శిక్షణకు ఇబ్బందిగా మారింది. ప్రస్తుత ఆర్థిక పరిస్థితులు, అవసరాల నేపథ్యంలో శివారు ప్రాంతాల్లో కొత్త భవనాలు నిర్మించే కంటే.. ప్రస్తుతం వివిధ దశల్లో ఉన్న టిమ్స్ భవనాల్లోనే మెడికల్ కాలేజీలు, నర్సింగ్ కాలేజీలు నిర్వహిస్తే అన్ని సమస్యలకు శాశ్వత పరిష్కార మార్గం చూపొచ్చనే యోచనలో ఉన్నట్లు తెలిసింది.

నవ కవనం!

తెలుగు సాహిత్యానికి యువ రచయితల అక్షరాభిషేకం

- విభిన్న ఇతివృత్తాలతో వైవిధ్యభరిత రచనలు
- రెండో రోజు పుస్తక ప్రదర్శనలో సందర్శకుల సందడి

సాక్షి, సిటీబ్యూరో: పుస్తకం కొత్త పుంతలు తొక్కుతోంది. యువతరం సృజనాత్మకతకు పట్టం కడుతోంది. కథ, నవల, చరిత్ర, ప్రక్రియ ఏదైనా సరే కొత్త తరం ఆలోచనలకు, భావజాలానికి ఊపిరిలూదుతోంది. సామాజిక మాధ్యమాల ఉద్ధృతిలో.. పుస్తక పఠనం ప్రమాదంలో పడిపోయిందనే ఆందోళన వెల్లువెత్తుతున్న ప్రస్తుత తరుణంలోనూ ఠీవీగా దర్శనమిస్తోంది. వైవిధ్యభరితమైన సాహిత్యంతో పాఠకులను ఆకటుకుంటోంది. సామాజిక జీవనంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా సరికొత్త ఇతివృత్తాలతో పాఠక ప్రపంచాన్ని తట్టి లేపుతోంది. పుస్తకానికి ఏ మాత్రం ఆదరణ తగ్గలేదనేందుకు నిదర్శనంగా నిలుస్తోంది. ఒక్కోటి వందలు, వేల సంఖ్యలో అమ్ముడవుతోంది. ఈ క్రమంలోనే నవతరం పాఠకుల అభిరుచికి ప్రాతినిధ్యం వహించే కొత్తతరం రచయితలు ముందుకు వస్తున్నారు. తమదైన ప్రాపంచిక దృక్పథంతో, భావజాలంతో అద్భుతమైన రచనలు చేస్తున్నారు. హైదరాబాద్ జాతీయ పుస్తక ప్రదర్శనలో యువ రచయితల పుస్తకాలు, స్టాళ్లు పాఠకులను ఆకట్టుకుంటున్నాయి. హైదరాబాద్ బుక్ ఫెయిర్ కమిటీ రచయితల కోసం స్వయంగా 7 స్టాళ్లను ఏర్పాటు చేసింది.



మరోవైపు పలు ప్రచురణ సంస్థలు సైతం యువ రచయితలకు సముచితమైన ప్రోత్సాహాన్ని అందజేస్తున్నాయి. ఇంచుమించు అన్ని స్టాళ్లలోనూ కొత్త తరం రచయితల పుస్తకాలు కనిపిస్తున్నాయి. రెండోరోజు శుక్రవారం పుస్తక ప్రదర్శన సందర్శకులతో కళకళలాడింది.

కొత్తగా.. పొత్తమొచ్చెనా..

హైదరాబాద్ పుస్తక ప్రదర్శన ప్రతి సంవత్సరం కొత్త రచయితలను పరిచయం చేస్తోంది. ఏటా లక్షలాది మంది పాఠకులు పుస్తక ప్రదర్శనకు తరలి వస్తున్నారు. వేలాది పుస్తకాలు అమ్ముడవుతున్నాయి. సమస్త ప్రపంచం మొబైల్ ఫోన్‌లోనే ఇమిడి ఉందని భావిస్తున్న పరిస్థితుల్లోనూ పుస్తకమే సమస్తమై పాఠకులకు చేరువవుతోంది. కొత్తగా రాయాలనుకొనే ఎంతోమందికి ఇది స్ఫూర్తినిస్తోంది. 'ప్రతి సంవత్సరం బుక్‌ఫెయిర్‌కు వస్తాను. మొదట్లో పెద్దగా పుస్తకాలు చదివే అభిరుచి కూడా లేదు.. కానీ క్రమంగా అలవాటైంది. ఓ 20 పుస్తకాలు చదివిన తర్వాత నేను కూడా రాయగలననే ఆత్మస్థైర్యం వచ్చింది. ఇప్పుడు రాస్తున్నాను' అని ఓ యువ రచయిత అభిప్రాయపడ్డారు. సామాజిక దృక్పథంతో రాస్తున్నవాళ్లు కూడా వినూత్నంగా తమ ఆలోచనలను ఆవిష్కరిస్తున్నారు.

ఆయువు తీసిన ఆన్‌లైన్ బెట్టింగ్

ఒంటిపై పెట్రోల్ పోసుకొని విద్యార్థి బలవన్మరణం



సాయి కిరణ్

మహేశ్వరం: ఆన్‌లైన్ బెట్టింగ్ వ్యవసనం ఓ విద్యార్థి ఆయువు తీసింది. ఈ విషాదకర సంఘటన మహేశ్వరంలో చోటుచేసుకుంది. సీఐ వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. మహేశ్వరం గ్రామం పోచమ్మ బస్తీకి చెందిన వెదిరె సాయి కిరణ్ (22) నారాయణగూడలోని అవినాష్ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. కొన్ని రోజులుగా సాయి కిరణ్ ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు పాల్పడుతూ అప్పులు చేశాడు. అప్పులు విపరీతంగా పెరిగిపోవడం.. అప్పు ఇచ్చినవారు ఒత్తిడి చేస్తుండడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో గురువారం తల్లిదండ్రులు కూలి పనులకు వెళ్లడంతో ఇంట్లో ఎవరూ లేనిది చూసి ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. గమనించిన స్థానికులు వెంటనే మంటలు ఆర్పేసి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు. మృతుని తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతి


ఆవు కళేబరం

కేశంపేట: విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని పోమాల్‌పల్లి గ్రామ శివారులో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నిదురం జంగయ్య పాడి పరిశ్రమపైన ఆధారపడి జీవనం సాగిస్తున్నాడు. ఆయన రోజు మాదిరిగా తనకున్న ఆవును మేతకు తీసుకువెళ్లాడు. మేత మేస్తుండగా కంచె లేకుండా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి షాక్‌తో ఆవు మృతి చెందింది. రైతు పాడి పరిశ్రమపైనే ఆధారపడి కుటుంబ పోషణ చేస్తున్నాడని, ప్రభుత్వమే ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

లారీ కింద పడి వ్యక్తి ఆత్మహత్య

మొయినాబాద్: రోడ్డు పక్కన ఓ మహిళతో మాట్లాడుతూ అకస్మాత్తుగా లారీ కింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మండల పరిధిలోని అజీజ్‌నగర్ పాత చౌరస్తా సమీపంలో శుక్రవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని ఆసిఫ్‌నగర్ ప్రాంతానికి చెందిన లోకేష్(40) ఓ మహిళతో కలిసి చిలుకూరు బాలాజీ దేవాలయానికి వచ్చారు. బైక్‌పై తిరిగి వెళ్తూ మండల పరిధిలోని అజీజ్‌నగర్ పాత చౌరస్తా సమీపంలో ఆగారు. ఇద్దరు రోడ్డు పక్కన మాట్లాడుకుంటున్నారు. లోకేష్ అకస్మాత్తుగా రోడ్డుపై నగరం వైపు వెళ్తున్న లారీ కింద పడ్డాడు. లారీ వెనక టైర్లు అతనిపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. లారీ డ్రైవర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఎస్‌బీఐ మెగా ప్రాపర్టీ షో ప్రారంభం

మాదాపూర్: హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టేందుకు, సొంతింటి కలను సాకారం చేసుకోవడానికి మంచి అవకాశాలు ఉన్నాయని హైదరాబాద్ క్రెడాయి అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. మాదాపూర్‌లోని హైటెక్స్‌లో మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఎస్‌బీఐ మెగా ప్రాపర్టీ షోను నిర్వాహకులతో కలసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నగరంలో నిర్మాణాభివృద్ధి రోజురోజుకు అభివృద్ధి చెందుతుందన్నారు.

ప్రజావాణిని వినియోగించుకోండి

చేవెళ్ల: ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించేందుకు డివిజన్ కేంద్రంలో ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు చేవెళ్ల ఆర్డీఓ చంద్రకళ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఆర్డీఓ కార్యాలయం వద్ద ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమంతో అందుబాటులో ఉంటామని చెప్పారు. ఉదయం 10–30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజావాణి ఉంటుందన్నారు. డివిజన్‌లోని ప్రజలు తమ సమస్యల ఫిర్యాదులను నేరుగా అందించవచ్చునని చెప్పారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

కారులో తరలిస్తున్న గంజాయి స్వాధీనం

శంషాబాద్ రూరల్: కారులో గంజాయి తరలిస్తున్న ఇద్దరు పోలీసులకు పట్టుబడ్డారు. పోలీసుల సమాచారం మేరకు... ఖమ్మంకు చెందిన భానుతేజ రెడ్డి(25), వరంగల్‌కు చెందిన రాజ్‌కుమార్(26) నగరంలో ప్రైవేటు ఉద్యోగం చేస్తుంటారు. వీరు మారుతి కారులో శుక్రవారం బెంగుళూరు నుంచి హైదరాబాద్ వస్తున్నారు. తొండుపల్లి వద్ద పోలీసులు కారును ఆపి తనిఖీ చేయగా.. వారి వద్ద ఉన్న 70 గ్రాముల గంజాయి దొరికింది. వీరు గంజాయిని సేవించడమే కాకుండా విక్రయిస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

‘లగచర్ల’కు పండుగొచ్చింది

స్వగ్రామాలకు చేరిన గిరిజన రైతులు


జైలు నుంచి వచ్చిన వారిని పట్టుకుని రోదిస్తున్న కుటుంబ సభ్యులు

- భావోద్వేగానికి గురైన కుటుంబ సభ్యులు
- తమవారిని చూసి కన్నీటి పర్యంతం
- ఘనంగా స్వాగతం పలికిన స్థానికులు

దుద్యాల్: లగచర్ల కేసులో జైలుకు వెళ్లిన గిరిజన రైతులు 37 రోజుల తర్వాత స్వగ్రామాలకు చేరారు. వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్లలో నవంబర్ 11న జరిగిన ఘటనలో అరెస్టయిన లగచర్ల, రోటిబండతండా, పులిచర్లకుంట తండాలకు చెందిన 17మంది రైతులు శుక్రవారం సంగారెడ్డి జైలు నుంచి బెయిల్‌పై విడుదలై ఇళ్లకు చేరుకున్నారు. వీరి రాకకోసం కళ్లు కాయలు కాసేలా ఎదురు చూసిన బాధిత కుటుంబ సభ్యులు తమ వారిని చూసి ఉద్వేగానికి లోనయ్యారు. గ్రామాల్లో వాహనాలు చేరుకోగానే టపాసులు పేల్చి, గుమ్మడికాయలు కొట్టి, పూలదండలు వేసి స్థానికులు ఘనంగా స్వాగతం పలికారు. నెలకు పైగా జైలు జీవితాన్ని గడిపిన బాధితులు, ఇళ్లలో ఉండి నరకం అనుభవించిన కుటుంబ సభ్యులు ఒక్కసారిగా కన్నీటి పర్యంతమయ్యారు. కొంతమంది మహిళలు బోరున విలపిస్తూ తమ వారిని హత్తుకున్నారు. కొడుకును చూసి తల్లి, భర్తను చూసి భార్య, మనవడిని చూసి అవ్వ.. ఆనందపరవశులయ్యారు. ఇది చూసిన గ్రామస్తులు సైతం కంటతడి పెట్టారు. జైలు నుంచి విడుదలైన వారంతా మొదట రోటిబండతండాకు చేరుకోవడంతో ఉద్విగ్న వాతావరణం నెలకొంది.



దేవుడి దయతో క్షేమంగా వచ్చాడు

జైలులో గుండెపోటుకు గురైన హీర్యానాయక్ చూసి ఆయన భార్య దేవీబాయి సంతోషం వ్యక్తం చేసింది. ఆస్పత్రికి తీసుకెళ్లే క్రమంలోనూ పోలీసులు తన భర్తకు బేడీలు వేయడాన్ని గుర్తుచేసుకుని కంటతడిపెట్టింది. దేవుడి దయవల్ల ఆయన క్షేమంగా తిరిగొచ్చాడని తెలిపింది.

– దేవిబాయి, పులిచర్లకుంటతండా



చూసి ఎన్ని రోజులైంది బిడ్డా..

రోటిబండతండాకు చెందిన వినోద్ తల్లి సుశీలబాయి కొడుకును చూసి బోరున విలపించింది. ఎన్ని రోజులైంది బిడ్డా నిన్ను చూసి అంటూ గుండెలకు హత్తుకుంది. పోలీసులు కొట్టిన దెబ్బలతో తన కొడుకు చేతికి కాయలు కాచాయని కన్నీటి పర్యంతమైంది.



నా చేతి ముద్ద తిను బిడ్డా..

రోటిబండతండాకు చెందిన సోనీబాయికి ఏకైక కుమారుడు బాష్యనాయక్. లగచర్ల ఘటనతో తన కొడుకుకు ఎలాంటి సంబంధం లేదని, కేవలం ఆరోజు రాత్రి ఇంట్లో ఉన్న పాపానికి పోలీసులు తీసుకెళ్లారని వాపోయింది. 37 రోజుల తర్వాత ఇంటికి వచ్చిన కొడుకుకు అన్నం కలిపి ఆప్యాయంగా ముద్దలు తినిపించింది.



ఆనందభాష్పాలు..

పులిచర్లకుంటతండాకు చెందిన రైతు ప్రవీణ్‌నాయక్ భార్య జ్యోతి నిండు గర్భిణి. తన భర్తను అరెస్టు చేసిన రోజు ఎంత వేడుకున్నా పోలీసులు వినలేదని వాపోయింది. తమవారి కోసం ఢిల్లీకి వెళ్లి ఎన్‌హెచ్‌ఆర్సీ, ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను కలిశామని తెలిపింది. డెలివరీ సమయంలో తన భర్త ఇంటికి రావడం సంతోషంగా ఉందని ఆనందభాష్పాలు రాల్చింది.

ఉచిత కుట్టు మిషన్ పథకానికి దరఖాస్తులు

ఇబ్రహీంపట్నం రూరల్: తెలంగాణ రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో అందించే మహిళలకు ఉచిత కుట్టు మిషన్ పథకాన్ని సద్వినియోగించుకోవాలని మైనార్టీ సంక్షేమశాఖ జిల్లా అధికారి నవీన్‌కుమార్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16 నుంచి 31 వరకు ముస్లిం, సిక్కులు, బుద్ధిస్టులు, జైనులు, పార్సీలకు చెందిన మహిళలు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 18 నుంచి 55 ఏళ్ల వరకు వయసు ఉండాలన్నారు. టైలరింగ్‌లో సర్టిఫికెట్ ఉన్నవారు అర్హులని తెలిపారు.

చికిత్స పొందుతూ.. కూలీ మృతి

చేవెళ్ల: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందిన సంఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. మండలంలోని తంగడపల్లి అనుబంధ గ్రామమైన మడికట్టుకు చెందిన హన్మంత్‌రెడ్డి, పోచయ్య(55)లు బుధవారం బైక్‌పై ఎన్కేపల్లి దగ్గర పెళ్లికి హాజరై తిరిగి స్వగ్రామానికి వస్తున్నారు. మార్గమధ్యలో శంకర్‌పల్లి మండలంలోని హుసేన్‌పూర్ చౌరస్తాలో ఎదురుగా వస్తున్న కారు ఢీకొన్న విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో గాయపడిన ఇరువురిని నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అందులో తీవ్రంగా గాయపడిన పోచయ్య గురువారం రాత్రి మృతి చెందాడు. మృతుడి కుటుంబసభ్యులు, గ్రామస్తులు శుక్రవారం చేవెళ్లలో పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని కారుతో ఢీకొట్టిన పోలీస్ అధికారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్ వారితో మాట్లాడి ఈ ప్రమాదానికి సంబంధించి ఘటన జరిగిన రోజునే కేసు నమోదు చేసినట్లు చెప్పారు. కారుతో ఢీకొట్టిన పోలీస్ అధికారి భాస్కర్‌రెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. మృతి చెందిన పోచయ్య కుటుంబానికి చేవెళ్ల మాజీ ఎంపీపీ ఎం.బాల్‌రాజ్ రూ.25 వేల నగదు అందించారు. మృతుడు వ్యవసాయ కూలీగా జీవనం సాగించేవాడు. కార్యక్రమంలో గ్రామ నాయకులు రాజు, సత్తయ్య ఉన్నారు.

గంజాయి విక్రేతలకు రిమాండ్

పహాడీషరీఫ్: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని బాలాపూర్ పోలీసులు అరెస్ట్ చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. శక్కర్‌గంజ్‌కు చెందిన మహ్మద్ నసీర్(38), షాహిన్‌నగర్‌కు చెందిన సయ్యద్ మసూద్(28)లు గంజాయిని ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలు చేసి షాహిన్‌నగర్‌లో అవసరమైన వారికి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. శుక్రవారం షాహిన్‌నగర్‌లో గంజాయి విక్రయించేందుకు యత్నిస్తున్న క్రమంలో విశ్వసనీయ సమాచారంతో పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 15 గ్రాముల గంజాయి, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

కూతురు పెళ్లి కోసం దాచిన..

- రూ.లక్ష అగ్నికి ఆహుతి
- దేవుడి దీపంతో మంటలంటుకొని ఘటన


ఇంట్లో కాలిపోయిన సామగ్రి

శంకర్‌పల్లి: ప్రమాదవశాత్తు ఇంట్లో మంటలు చెలరేగి దగ్ధమైన సంఘటన శుక్రవారం శంకర్‌పల్లి మండలంలో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రావులపల్లి గ్రామానికి చెందిన మాధవి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. భర్త నారాయణ 13 ఏళ్ల క్రితం మతిస్థిమితం సరిగ్గా లేక ఇల్లు వదిలేసి వెళ్లిపోగా.. ఆమెకు ఇద్దరూ కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. శుక్రవారం మాధవి తన ఇంట్లో పూజ చేసి, దీపం వెలిగించి కూలీ పనులకు వెళ్లిపోయింది. ఇంట్లోని ఎలుకలు దీపాన్ని కింద పడేయడంతో పక్కనే ఉన్న బట్టలకు నిప్పు అంటుకుంది. బీరువా, వస్తువులు, బట్టలు పూర్తిగా దగ్ధమయ్యాయి. బీరువాలో దాదాపు రూ.లక్ష వరకు నగదు ఉంటుందని, దానిని తన కుమార్తె వివాహానికి దాచి ఉంచినట్లు ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, దాతలు సాయం చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేసింది.

నేడు ఎల్బీ స్టేడియం కేంద్రంగా ట్రాఫిక్ ఆంక్షలు

సాక్షి, సిటీబ్యూరో: ఎల్బీ స్టేడియంలో శనివారం జరిగే క్రిస్మస్ వేడుకలకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు స్టేడియం కేంద్రంగా ట్రాఫిక్ మళ్లింపులు, ఆంక్షలు విధిస్తూ సిటీ ట్రాఫిక్ చీఫ్ పి.విశ్వప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆ సమయంలో ఏఆర్ పెట్రోల్ పంప్, బీజేఆర్ స్టాట్యూ, బషీర్‌బాగ్, ఎస్‌బీఐ గన్‌ఫౌండ్రీ, సుజాత స్కూల్, కేఎల్‌కే ఎస్టేట్‌ల నుంచి వాహనాలను స్టేడియం వైపు అనుమతించరు. ఆర్టీసీ బస్సులకు ఇవి వర్తిస్తాయి. వీటిని దృష్టిలో పెట్టుకుని నగర వాసులు సహకరించాలని పోలీసులు కోరారు.

పార్కింగ్ స్థలాన్ని కాపాడండి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ విజయలక్ష్మి

మీర్‌పేట: కబ్జాకు గురైన పార్కింగ్ స్థలాలను తిరిగి ప్రజలకు ఇప్పించాలని మీర్‌పేట కార్పొరేషన్ 31వ డివిజన్ కార్పొరేటర్ విజయలక్ష్మి శుక్రవారం కలెక్టర్ నారాయణరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జనప్రియా మహానగర్‌లోని 5, 9ఏ బ్లాకులలోని పార్కింగ్ స్థలాన్ని కొందరు కబ్జా చేసి షెటర్లు నిర్మించారని ఆరోపించారు. ఒక్కో షెటర్‌ను రూ.10 లక్షలకు విక్రయిస్తున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఇప్పటివరకు 8 షెటర్లను అమ్ముకోగా, మరో పది షెటర్లు అమ్మకానికి పెట్టారని వివరించారు. ఈ మేరకు పార్కింగ్ స్థలాన్ని కాపాడాలని కలెక్టర్‌ను కోరినట్లు చెప్పారు. కలెక్టర్ స్పందిస్తూ.. ఆక్రమణ దారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఆమె తెలిపారు

పేదలకు అందని విద్య, వైద్యం

- హోంమంత్రి క్షమాపణలు చెప్పాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్‌వెస్లీ


యాచారంలో సాగర్‌రోడ్డుపై సీపీఎం శ్రేణులు ధర్నా

యాచారం: ప్రభుత్వ విద్య, వైద్యం పేదలకు అందనంత దూరంలో ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్‌వెస్లీ ఆరోపించారు. యాచారం మండల కేంద్రంలో శుక్రవారం సీపీఎం ఎనిమిదో మండల మహాసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిరి గానే ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ పాలిస్తుందని మండిపడ్డారు. రూ.లక్షల కోట్ల అప్పులు తెచ్చి బడా పారిశ్రామిక వేత్తలకు దోచిపెట్టడమే తప్పా పేదలకు ఏ మాత్రం మేలు చేయడం లేదని ఆరోపించారు. ప్రస్తుతం బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారన్నారు. ప్రజా సంక్షేమాన్ని మరిచిందని దుయ్యబట్టారు. సీపీఎం జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్ మాట్లాడుతూ.. పాలక ప్రభుత్వాలు జిల్లాలో పేదలకు చెందిన విలువైన అసైన్డ్, పట్టా భూములను పరిశ్రమలు, ప్రాజెక్టుల పేరుతో సేకరిస్తూ రైతులను కూలీలుగా మారుస్తున్నాయని మండిపడ్డారు. పేదలకు ఎర్రజెండా నీడలోనే న్యాయం జరుగుతుందని తెలిపారు.

సాగర్‌రోడ్డుపై రాస్తారోకో

పార్లమెంట్‌లో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలపై సాగర్‌రోడ్డుపై సీపీఎం శ్రేణులు రాస్తారోకో నిర్వహించారు. కేంద్రంలో మూడుసార్లు అధికారంలోకి వచ్చిన బీజేపీకి గర్వం పెరిగిందని అన్నారు. కేంద్ర హోంమంత్రి వెంటనే క్షమాపణలు చెప్పకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు పగడాల యాదయ్య, సామేల్, మధుసూదన్‌రెడ్డి, జగదీష్, నర్సింహ, అంజయ్య, బ్రహ్మయ్య, చందునాయక్ పాల్గొన్నారు.

అమిత్‌షా వ్యాఖ్యలు అభ్యంతరకరం


మొయినాబాద్‌లో జెండా ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

మొయినాబాద్: పార్లమెంట్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా వెంటనే రాజీనామా చేయాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు, చేవెళ్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కె.రామస్వామి డిమాండ్ చేశారు. సీపీఐ వందేళ్ల ఉత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం మొయినాబాద్ మండల కేంద్రంలో ఎర్రజెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా బాబాసాహెబ్ రాసిన రాజ్యాంగ ఫలాలను అనుభవిస్తూ ఆయనపైనే అనుచిత వ్యాఖ్యలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. అంబేడ్కర్ పట్ల బీజేపీ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏమిటో హోంమంత్రి వ్యాఖ్యలే బహిర్గతం చేస్తున్నాయన్నారు. సీపీఐ మండల కార్యదర్శి శ్రీనివాస్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు అంజయ్య, సత్తిరెడ్డి, మంజుల, ప్రభాకర్, మోహన్ రెడ్డి, జహంగీర్, యాదగిరి, నర్సింలు, రాములు, యశోద, రాజు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

శంకర్‌పల్లి: భారతదేశంలోని నిరుపేదలకు కోసం సీపీఐ వందేళ్ల నుంచి అలుపెరుగని పోరాటం చేస్తోందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామస్వామి స్పష్టం చేశారు. డిసెంబర్ 26న సీపీఐ ఏర్పడి వందేళ్లు కానున్న సందర్భంగా ఉత్సవాల పోస్టర్‌ని మండల కార్యదర్శి సుధీర్ అధ్యక్షతన శుక్రవారం శంకర్‌పల్లి పట్టణంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడుతూ.. గడిచిన వందేళ్లలో సీపీఐ అనేక విజయాలు సాధించిందని గుర్తు చేసుకున్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో 4,000 మంది వీరమరణం పొందారని, ఆ తర్వాత దాదాపు 10లక్షల ఎకరాలను పేదలకు పంచినట్లు గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రభువు లింగం, సత్యనారాయణ, గోపాల్‌రెడ్డి, శేఖర్, వెంకటయ్య, ప్రవీణ్, గంగయ్య, నర్సింహులు, అనంతయ్య, అశోక్ పాల్గొన్నారు.